ఫుట్‌పాత్‌లు ఉన్నా.. లేనట్టే..!

- అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో నిర్మించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- వ్యాపారుల ఆక్రమణతో పాదచారులకు ఇబ్బందులు
- నడవడానికి వీలు లేకుండా వ్యాపారాలు


ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన పూల వ్యాపారులు


సంఘం ఆఫీస్ కూడలిలో ఫుట్‌పాత్‌పై ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలు

సీతంపేట: అభివృద్ధి పనుల్లో భాగంగా పాదచారులు నడవడానికి కోట్లాది రూపాయలు వెచ్చించి గత ప్రభుత్వం ఫుట్‌పాత్‌లు నిర్మించినా... కొంతమంది వ్యాపారుల ఆక్రమణతో లక్ష్యం నెరవేరలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2004 మాస్టర్ ప్లాన్ ప్రకారం రూ.12.50 కోట్ల వ్యయంతో అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌ను గత ఏడాది విస్తరించింది. హైవే నుంచి మహారాణి పార్లర్ వరకు 80 అడుగులుగా, మహారాణి పార్లర్ నుంచి దొండపర్తి కూడలి వరకు 60 అడుగులుగా రోడ్ విస్తరణ, బ్యూటిఫికేషన్ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా అక్కయ్యపాలెం రోడ్డుకు ఇరువైపులా పాదచారులు నడిచేందుకు వీలుగా ఫుట్‌పాత్‌లు నిర్మించారు. అయితే రహదారికి ఆనుకుని ఉన్న వ్యాపారులు ఆ ఫుట్‌పాత్‌లు ఆక్రమించేశారు. తమ షాపుల ముందున్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఇంకేముంది ఎప్పటిలాగే పాదచారులు రద్దీ మార్గంలో నడవడానికి అవస్థలు పడుతూనే ఉన్నారు.

పట్టించుకోని అధికారులు

అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ నిత్యం వాహనాల రాకపోకలు, మరొక వైపు పలు వ్యాపార సంస్థల వద్దకు వచ్చే వినియోగదారులతో రద్దీగా ఉంటుంది. సాయంత్రం వేళల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. సమస్యను పరిష్కరించే దిశగా గత ప్రభుత్వం 2004 మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణ చేపట్టింది. అందులో భాగంగా పాదచారులు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, స్కూల్‌కి వెళ్లే పిల్లలు నడిచేందుకు వీలుగా ఫుట్‌పాత్‌లు నిర్మించారు. అభివృద్ధి చేసిన ఫుట్‌పాత్‌లు పాదచారులు నడిచే వీలు లేకుండా హైవే నుంచి దొండపర్తి కూడలి వరకు వ్యాపారులు ఆక్రమించేశారు. అయినా ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా పాదచారులకు అవస్థలు తప్పడం లేదు.


ఎస్‌కేఎంఎల్ వద్ద ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన చాట్ వ్యాపారం

నడిచే వీలు లేదు

అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. మహిళలు, వృద్ధులు, పిల్లలు నడవాలంటే భయపడుతుంటారు. గత ప్రభుత్వం లక్షలాది రూపాయలతో ఫుట్‌పాత్‌లు నిర్మించడంతో చాలా సంతోషించాం. పాదచారులు నడవడానికి ఉపయోగపడుతుందని అనుకున్నాం. ఇంతలోనే నడిచే వీలు లేకుండా వ్యాపారులు పూర్తిగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించేశారు. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగిస్తే బాగుంటుంది.
– ఎస్.శంకర్, అక్కయ్యపాలెం

ఫుట్‌పాత్‌లు ఆక్రమించేశారు

అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌కు ఆనుకుని ఉన్న షాపులు, దుకాణాల నిర్వాహకులు వ్యాపారం కోసం ఫుట్‌పాత్‌ను ఆక్రమించేశారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఫుట్‌పాత్‌లు ప్రజలకు ఉపయోగపడుతున్నాయా..? లేదా..? అని అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. పది మంది నడవడానికి నిర్మించిన ఫుట్‌పాత్‌లను వ్యాపారులు వినియోగిస్తున్నారు. అధికారులు ఆక్రమణలు తొలగిస్తే ప్రయోజనం ఉంటుంది. – కింతాడ శ్రీను, అక్కయ్యపాలెం


ఫుట్‌పాత్‌ను ఆక్రమించి నిర్వహిస్తున్న కాఫీ షాప్


ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన చెరుకు రసం బండి


ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన ప్లాస్టిక్ వస్తువుల వ్యాపారి

వరాహగిరి కాలనీలో జారిపడిన రాళ్లు


వరాహగిరి కాలనీలో జారిపడిన మట్టి, రాళ్లు

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతం వరాహగిరి కాలనీలో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు బురద, చిన్నపాటి రాళ్లు ఇంటిపైకి వచ్చి చేరాయి. దీంతో వెంటనే స్థానికులు జీవీఎంసీ అధికారులకు తెలియజేశారు. సోమవారం ఈ ప్రాంతాన్ని సందర్శించిన కార్పొరేటర్ కంపా హనోకు జీవీఎంసీ అధికారులతో మాట్లాడి శుభ్రం చేయించారు. ఈ ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

యూజీడీ లీకుతో అవస్థలు


సీతంపేటలో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట కూడలి నుంచి జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే మార్గంలో యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. మురుగు నీరు రోడ్డుపై నుంచి ఏరులై ప్రవహిస్తోంది. దీంతో మూడు రోజులుగా పాదచారులు, వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. అక్కడే ఏర్పాటు చేసిన వినాయక మండపానికి వచ్చే భక్తులు సైతం అవస్థలు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ముగిసిన నేత్రదాన పక్షోత్సవాలు


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జగదీశ్వరరావు

సీతంపేట : జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమం స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో సోమవారం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివానంద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంధత్వ నివారణకు నేత్రదాన ఆవశ్యకతపై 15 రోజులపాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని అభినందించారు. మరణించిన తర్వాత కూడా నేత్రదానం వల్ల చిరంజీవులుగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా నేత్రదాన ఆవశ్యకతపై పీజీలకు, ఆప్తోమెట్రీ విద్యార్థులకు, జీవీఎంసీ హైస్కూళ్లలో విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రభాకర శాస్త్రి, జ్యోతిర్మయి, ఆర్‌ఎంవో నవీన్‌కుమార్, మొహిసిన్, ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సిబ్బంది, ప్రభుత్వ నేత్ర వైద్యశాల ప్రొఫెసర్లు, వైద్యులు పాల్గొన్నారు.

పాము కలకలం

సీతమ్మధార: స్థానిక టీపీటీ కాలనీ ఎస్ఎఫ్ఎస్ స్కూలు వెనుక రోడ్డులో ఒక బైకు మీదకి పాము చేరడంతో స్థానికులు ఆందోళన చెందారు. వాహన చోదకుడు బైక్ పైనుంచి సీటు తీసేసినప్పటికీ పాము చాలా సేపు అందులోనే ఉండిపోయింది. చాలా సేపు కర్రలతో పాముని అదిలించడంతో బయటకు రాగానే కొట్టి చంపేశారు. ఇది చాలా ప్రమాదకరమైన కట్లపాము అని... కాటేస్తే వెంటనే ప్రాణాలు పోతాయని వారు చెప్పారు. వర్షాలకు సమీపంలోని పొదల నుంచి ఈ పాము వచ్చి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

పోలీసుల అదుపులో చైన్‌స్నాచర్లు..!

సీతమ్మధార: ఇద్దరు చైన్‌స్నాచర్లని నాలుగో పట్టణ క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని విశ్వసనీయంగా తెలిసింది. సీతంపేట ప్రాంతానికి చెందిన వానపల్లి మంగ (55) పోర్టు స్టేడియం ఈస్ట్ గేటు ప్రాంతంలోని ఒక ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తున్నారు. ఈ నెల 7న ఉదయం 6.30 గంటల సమయంలో అక్కడికి వెళ్తుండగా మార్గ మధ్యలో గురుద్వారా వద్ద ఇద్దరు వ్యక్తులు వెనుక నుంచి ద్విచక్ర వాహనం మీద వచ్చి మెడలోని రెండున్నర తులాల బంగారు మంగళసూత్రం తెంపుకుని వెళ్లిపోయారు. వీరు ప్రస్తుతం ఢిల్లీలో వున్నట్టు గుర్తించారని సమాచారం. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ప్రత్యేక పర్యవేక్షణలో ఆయన ఆదేశాల మేరకు ఆదివారం క్రైం పోలీసులు ఢిల్లీలో వీరిని అదుపులోకి తీసుకుని విశాఖ తీసుకొస్తున్నారని సమాచారం. చైన్‌స్నాచింగ్ కేసుని స్వల్ప వ్యవధిలోనే క్రైం పోలీసులు ఛేదించడం విశేషం.

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం


పక్కి శ్రావణి

మర్రిపాలెం : హాస్టల్‌లో ఉంటూ నర్సింగ్ కోర్సు అభ్యసిస్తున్న ఓ విద్యార్థిని అదృశ్యమైంది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన పక్కి శ్రావణి (19) జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ హాస్టల్‌లో ఉంటూ నర్సింగ్ కోర్సు చదువుతోంది. గత నెల 31న ఇంటికి వెళ్తానని చెప్పి హాస్టల్ నుంచి వెళ్లిపోయింది. హాస్టల్ నిర్వాహకులు ప్రతీ ఆదివారం విద్యార్థులతో వారి తల్లిదండ్రులకు ఫోన్ చేయిస్తారు. ఈ క్రమంలో ఈ నెల 8న కుమార్తె నుంచి ఫోన్ రాకపోవడంతో తల్లిదండ్రులు బొబ్బిలి నుంచి హాస్టల్‌కు వచ్చారు. అయితే శ్రావణి ఇంటికి వెళ్లిందని హాస్టల్‌లో చెప్పడం.. ఆమె ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఏఎస్ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపైనే కార్ల నిలిపివేతతో ట్రాఫిక్‌జామ్


బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో కార్లతో రద్దీగా ఉన్న రోడ్డు

సీతమ్మధార: స్థానిక బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో గల నాలుగో, ద్వారకా పట్టణ పోలీస్ స్టేషన్ల రోడ్డులో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రెండు స్టేషన్ల ట్రాఫిక్ పోలీసులు ఇక్కడే వుంటున్నా సమీపంలో నిత్యం వాహనాలు నిలిచిపోతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ ఓ కారు మెకానిక్ షాపు, సెకండ్స్ సేల్స్ దుకాణం ఉన్నాయి. ఎదురుగా పోలీసు స్టేషన్ వాహనాలు ఉంటున్నాయి. ఇంకా విష్ణు హోండా షోరూమ్ కూడా ఉన్నాయి. దీంతో నిత్యం ఈ మార్గంలో ఇరువైపులా కార్ల పార్కింగ్ కారణంగా ట్రాఫిక్ స్తంభించిపోతోందని వాహన చోదకులు గగ్గోలు పెడుతున్నారు. ఇంత జరుగుతున్నా నాలుగో పట్టణ, ద్వారా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పలు పనుల మీద రెండు స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులు కూడా రోడ్డు మీదనే అధిక సంఖ్యలో వాహనాలు పార్కింగ్ చేస్తుంటారు. దీంతో ఈ రోడ్డంతా వాహనాల పార్కింగ్‌తోనే నిండిపోవడంతో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఆటంకం కలుగుతోందని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా నాలుగో పట్టణ ట్రాఫిక్ పోలీసులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వసతిగృహాల సమస్యలు పరిష్కరించాలి


బాబ్జీకి వినతిపత్రం అందజేస్తున్న ఏయూటీడీ సిబ్బంది, తదితరులు

సీతమ్మధార: జీవీఎంసీ పరిధిలో నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలని ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు కోరారు. ఈ మేరకు బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో టీడీపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో జీవీఎంసీ భవనాల్లో వసతి గృహాలు నిర్వహిస్తున్నామన్నారు. రోడ్ల మీద తిరిగే నిరాశ్రయులకు వసతి కల్పిస్తున్నామని, ఇంట్లో చెప్పకుండా పారిపోయి వచ్చే వారికి కూడా పోలీసుల సహకారంతో ఆశ్రయం కల్పిస్తున్నామన్నారు. ఇంకా మతిస్థిమితం లేక బాధపడుతున్న వారికి చినవాల్తేరులో గల ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స చేయించి స్వస్థలాలకు చేరుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ 32వ వార్డు అధ్యక్షుడు మహేష్, టీఎస్ఆర్ కాంప్లెక్స్ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి, భాస్కరరావు, లీలావతి, శ్రీనివాస్, ధనలక్ష్మి, శాంతి, ప్రశాంత్, చారి పాల్గొన్నారు.

వరద బాధితులకు బాసటగా రైతులు


వరద బాధితులకు కూరగాయలు విరాళంగా ఇచ్చిన రైతులతో రైతుబజార్ సిబ్బంది

సీతమ్మధార: విజయవాడను వరదలు అతలాకుతలం చేయడంతో అక్కడి బాధితులను దాతలు ఎన్నో రకాలుగా ఆదుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సీతమ్మధార రైతుబజార్‌కి చెందిన రైతులు కూడా కూరగాయలు విరాళంగా అందజేశారు. రెండు టన్నుల ఉల్లిపాయలు, బంగాళదుంపలు, పొట్లకాయలు, అరటికాయలు, క్యాబేజీ, టమాటా, బీరకాయలు, వంకాయలు, అరటిపండ్లు అందజేశారు. ఈ మేరకు బజారులో సోమవారం ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్‌కు అందజేశారు. వాటిని జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏర్పాటు చేసిన వాహనం ద్వారా విజయవాడకు తరలించారు. వరద బాధితులకు కూరగాయలు విరాళంగా ఇచ్చిన రైతులకు రైతుబజార్ సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.

సీతంపేట: విజయవాడ వరద బాధితులకు తమ వంతుగా సాయం అందించడానికి నరసింహనగర్ రైతు బజార్ రైతులు ముందుకొచ్చారు. 360 కిలోల కూరగాయలను బజారు ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ సేకరించి విజయవాడ తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

వరద బాధితులకు వాకర్స్ క్లబ్ సహాయం

మురళీనగర్: విజయవాడలో వరద బీభత్సంలో తీవ్రంగా నష్టపోయిన బాధితుల సహాయార్థం మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు విరాళాలు పంపించారు. క్లబ్ పూర్వ అధ్యక్షుడు కేజీ కృష్ణారావు, నిమ్మగడ్డ బుచ్చయ్య రూ.10 వేలు చొప్పున, వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం, రాపేటి వెంకటరమణ, కొడవటి రామకృష్ణారావు, ఏవీ సుబ్బారావు రూ.5 వేలు చొప్పున, క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి పి.చెల్వరాజు రూ.3 వేలు చొప్పున, జి.రామకృష్ణ, పి.సూర్యనారాయణ, ఎ.కృష్ణారెడ్డి రూ.2 వేలు చొప్పున విరాళాలు అందించారు. సభ్యులు అందించిన మొత్తం రూ.75,116లు మురళీనగర్ యూనియన్ బ్యాంకు మేనేజర్ రవీంద్ర ద్వారా ఆంధ్రప్రదేశ్ చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్‌కు సోమవారం పంపించారు. వరద బాధితులకు సహాయం చేయడానికి మానవతా దృక్పథంతో ముందుకొచ్చి విరాళాలు అందించిన వాకర్స్ క్లబ్ సభ్యులకు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, పి.చెల్వరాజు కృతజ్ఞతలు తెలిపారు.


యూనియన్ బ్యాంకు మేనేజర్ రవీంద్రకు విరాళాల చెక్కు అందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

త్రిముఖ గణపతిగా దుర్గా గణపతి


సీతంపేటలో త్రిముఖ గణపతి అలంకరణలో దుర్గా గణపతి


దుర్గా గణపతికి నివేదించిన వంద కిలోల లడ్డూ ప్రసాదం

సీతంపేట: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సీతంపేట కూడలిలో కొలువైన దుర్గా గణపతి మూడో రోజు సోమవారం త్రిముఖ గణపతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంత భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది. మంగళవారం 'స్కంద గణపతి' అలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిస్తారని కార్పొరేటర్ గోవింద్ తెలిపారు.

100 కిలోల లడ్డూ నివేదన

దుర్గా గణపతికి వంద కిలోల లడ్డూను ప్రసాదంగా నైవేద్యం పెట్టారు. భక్తుల దర్శనార్థం ఆలయం ముందు అద్దాల బాక్సులో లడ్డూను ఉంచారు. ఏటా ఉత్సవాల చివరి రోజు లడ్డూ వేలం వేస్తారు. వేలం పాట ద్వారా వచ్చిన డబ్బులను అన్నదాన కార్యక్రమానికి వినియోగిస్తుంటారు. ఈ ఏడాది కూడా నవరాత్రి ఉత్సవాల ఆఖరి రోజు లడ్డూ వేలం పాట నిర్వహిస్తామని కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ తెలిపారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు


శ్రీనివాస రెడ్డి

మర్రిపాలెం : ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. బసవ శ్రీనివాస రెడ్డి అనే వ్యక్తి కుటుంబంతో కలిసి కంచరపాలెం సుభాష్‌నగర్‌లో నివసించేవాడు. ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఈ నెల 4న రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి నిద్రపోయిన శ్రీనివాస రెడ్డి 5న ఉదయం అందరూ నిద్రలేచి చూసేసరికి కనిపించలేదు. వారంతా అంతటా వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం అతని భార్య బసవ రోజా ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ అబద్ధం కేసు దర్యాప్తు చేస్తున్నారు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కంచరపాలెం పోలీసులు కోరారు.

స్వచ్ఛమైన గాలి కోసం మొక్కలు నాటుదాం

మహారాణిపేట: 'స్వచ్ఛమైన గాలిలో పెట్టుబడి పెట్టండి' అనే నినాదంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. రేసపువానిపాలెం టీబీ ఆస్పత్రి కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా తిరిగి ఆస్పత్రి వరకు జరిగింది. ఈ సందర్భంగా ధర్నా చేస్తున్న వారిని ఉద్దేశించి డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల వడగాల్పులు అధికమై వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయన్నారు. ఇలాంటి వాతావరణంలో వ్యవసాయం, ఆరోగ్యంపై పెను ప్రభావం తప్పదని హెచ్చరించారు. స్వచ్ఛమైన గాలిలో పెట్టుబడి పెట్టండని, దీని కోసం మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు డాక్టర్ జగదీశ్ ప్రసాద్, బాలాజీ, ఐ.మనోరమ, బి.మురళీకృష్ణ, గణాంక అధికారి మణికుమారి, మోహన్, ఇతర వైద్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు


సాక్షి గణపతి ఆలయంలో పూజల్లో మహిళలు


ఉగ్రనరసింహావతారంలో వినాయకుడు

తాటిచెట్లపాలెం : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తాటిచెట్లపాలెంలో గల సాక్షి మహా గణపతి ఆలయంలో మూడో రోజు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల పర్యవేక్షణలో నిర్వహించిన పూజలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు పరిధి నక్కవానిపాలెంలో ఎన్‌పీపీ ట్రెండ్ ఛేంజర్స్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఉగ్ర నరసింహావతారంలో వినాయకుడు దర్శనమిస్తున్నారు. రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వినాయకుడికి సోమవారం గుప్తాజీ పూజలు చేశారు. నిర్వాహకులు పోలా అవినాష్, తారపు సాయిరెడ్డి, బోరా రామసాయి పవన్ రెడ్డి, సీహెచ్ గణేష్, కె.భాస్కరరావు, డి.రవిరెడ్డి, వి.జగదీష్, ఎం.రాము తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణం, నీటి వనరులు పరిరక్షించాలి

విశాఖ సిటీ: పర్యావరణ పరిరక్షణకు ప్రజల ఆలోచన ధోరణి మారాలని ఏయూ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు సూచించారు. ఏయూ బయోటెక్నాలజీ విభాగంలో సోమవారం బయో ఈ3 పాలసీపై జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని, ప్రకృతిని కాపాడాలంటే.. చెట్ల నరికివేతను నిలిపివేయాలని, నీటి వనరుల ప్రాంతాల్లో నిర్మాణాలను నిరోధించాలన్నారు.

సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్(సీడీఎఫ్‌డీ) ప్రతినిధి డాక్టర్ యతీష్ ఆచార్ మాట్లాడుతూ భవిష్యత్తులో బయోటెక్నాలజీతో సాంకేతిక విప్లవం వస్తుందని, 2030 నాటికి బయో ఎకానమీ 300 బిలియన్ డాలర్లు దాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 నాటికి బయో ఎకానమీ 10 ట్రిలియన్ డాలర్లతో దేశ జీడీపీలో 25 శాతం మేర వాటా ఉండే అవకాశం ఉంటుందని చెప్పారు. సదస్సులో సీడీఎఫ్‌డీ ప్రతినిధులు డాక్టర్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ ఎం.వి.సుబ్బారెడ్డి, డాక్టర్ రమేష్ ఎలగందుల, డాక్టర్ అశ్విన్ దలాల్, ఏయూ బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్లు డాక్టర్ పోలా సుధాకర్, డాక్టర్ ధనుంజయ్, డాక్టర్ పి.బిందియా, డాక్టర్ సుబ్బాతాతా, ప్రొఫెసర్ పద్దయ్య, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.